క్లుప్తంగా

రంజాన్ కానుకల పంపిణీ



రుద్రూర్: సులేమాన్‌నగర్‌కు రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వం సరఫరా చేసిన కానుకలు(తోఫా) బుధవారం లబ్ధిదారులకు స్థానిక సర్పంచ్ ఖాదర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు దస్తగిరి, బీఆర్ఎస్ అధ్యక్షుడు షేక్ హబీబ్, మజీద్ కమిటీ సదర్ షాదుల్ పాల్గొన్నారు.

నవీపేటలో..

నవీపేట: మండల కేంద్రంలోని బర్కత్‌పుర కాలనీలో ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా బుధవారం ముస్లిం మహిళలకు రంజాన్ కానుకలను అందజేశారు. రంజాన్ పండగను సంతోషంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు..



బాల్కొండ: మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులు 26 మందికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం మండల బీఆర్ఎస్ కార్యాలయం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీకాంత్, సర్పంచ్ బూస సునీత, ఉప సర్పంచ్ వాహబ్, కో–ఆప్షన్ సభ్యుడు ఫయాజ్, తదితరులున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు..



బోధన్‌రూరల్(బోధన్): సాలూర మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను ఎంపీపీ బుద్దె సావిత్రి అందజేశారు. బుధవారం సాలూర తహసీల్ కార్యాలయంలో 29మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జార్జిరెడ్డి 51వ వర్ధంతి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు అనిల్, నిఖిల్‌లు మాట్లాడుతూ.. సమ సమాజ స్థాపన, విద్యార్థి హక్కుల కోసం, ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా పోరాడి హత్యకు గురైన కామ్రేడ్ జార్జి రెడ్డి ఆశయాలను సాధిద్దామన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి దుర్గా ప్రసాద్, నవీన్, వంశీ పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ సభల పోస్టర్లు..



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో బుధవారం ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసు, సహాయ కార్యదర్శి శివాజీలు మాట్లాడుతూ.. తిరుపతిలో ఈ నెల 16, 17, 18 తేదీలలో జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు వెంకటేష్, గంగామణి, లక్ష్మీ, లలిత, అనిత, మన్నెమ్మ పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన


నవీపేట: మండలంలోని అభంగపట్నం జీపీని బుధవారం జెడ్పీ సీఈవో గోవింద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు వసూలు చేయాలని సూచించారు. నర్సరీలలోని మొక్కలు, వాటి సంరక్షణకు చేపడుతున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, కార్యదర్శి రామాగౌడ్ ఉన్నారు.

టీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేయాలి

తెయూ(డిచ్‌పల్లి): టీఎస్పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని, పేపర్ లీకేజీలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి ద్వారా సమగ్ర విచారణ జరిపించి, నిందితులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. తెయూలో విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

సంతలో సౌకర్యాలు నిల్

- ఎండాకాలంలో తాగునీటికి కటకట
- మరుగుదొడ్లు లేక ఇబ్బందులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు, పోలీసులు



ఆర్మూర్ సంత

ఆర్మూర్ టౌన్: వ్యాపారానికి అడ్డాగా మారిన ఆర్మూర్ సంతలో సమస్యలు నెలకొన్నాయి. ఆర్మూర్ మున్సిపల్ సమీపంలో అంగడి బజార్ ఉంది. ప్రతి బుధవారం పెద్ద ఎత్తున సంత జరుగుతుంది. చుట్టు ప్రక్కల 60 గ్రామాల నుంచి, రైతులు, చిరు వ్యాపారులు ఈ సంతకు వస్తారు. అయితే సంతలో కనీసం తాగు నీటి సౌకర్యం కూడా కల్పించలేదు. మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేకపోవడంతో సంతకు వచ్చే వినియోగదారులు అటు అమ్మకందారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సంవత్సరం తైబజారు వేలం ద్వారా రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతున్నా కనీస సదుపాయాలు కల్పించడం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు సంతలో రోజురోజుకు దొంగతనాలు పెరిగిపోయాయి. సంతకు వచ్చే కొనుగోలుదారుల నుంచి విలువైన సెల్ ఫోన్లు చోరీకి గురవుతున్నాయి. ఇలా ప్రతి బుధవారం జరిగే సంతలో సుమారు 10 ఫోన్ల వరకు చోరీకి గురవుతున్నాయి. అసలే ఇరుకు రోడ్డు ఆపై ఆటోలు, కార్లు సైతం సంతలోనికి తీసుకురావడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా నెలకొంటుంది. ప్రతి బుధవారం సాయంత్రం పోలీస్ పర్యవేక్షణ ఉండాలని పలువురు కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ అధికారులు, పోలీసులను సంతకు వచ్చే ప్రజలు కోరుతున్నారు.

తాగునీరు ఏర్పాటు చేస్తాం



ఆర్మూర్ అంగడి బజార్‌లో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేస్తాం. అలాగే మరుగుదొడ్లను సైతం అందుబాటులోకి తీసుకువస్తాం. ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకుంటాం.

–ప్రసాద్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

నిధులు మంజూరు చేయాలని వినతి



మంత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్‌లో మినీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే జీవన్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ.. మినీ కమ్యూనిటీ హాల్‌తో పాటు గ్రామంలోని కుల సంఘాల భవనాలకు సైతం నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే బాల్కొండ మండలం చిట్టాపూర్ నుంచి ఫత్తేపూర్, సుర్బిర్యాల్, కోమన్‌పల్లి ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ వరకు డబుల్ రోడ్డుతో పాటు సుర్బిర్యాల్ నుంచి జలాల్‌పూర్ వరకు లింక్ రోడ్డు నిర్మాణం గురించి గ్రామస్తులు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. సర్పంచ్ సట్లపల్లి సవితా గణేశ్ పాల్గొన్నారు.

నిజాంషుగర్స్‌ను ప్రభుత్వమే నడపాలి



బోధన్ ఎన్డీఎస్ఎల్ ఎదుట కార్మిక నాయకులు

బోధన్: నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్(ఎన్డీఎస్ఎల్)ను స్వాధీనం చేసుకొని ప్రభుత్వమే నడపాలని షుగర్ ఫ్యాక్టరీ కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సహకార రంగం పద్ధతిలో ఫ్యాక్టరీని పునరుద్ధరించి నడిపించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి కేటీఆర్ ప్రకటించిన నేపథ్యంలో బుధవారం పట్టణ కేంద్రంలోని శక్కర్‌నగర్ ఎన్డీఎస్ఎల్ ఎదుట కార్మిక సంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల పాత బకాయిలు చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.చనిపోయిన కార్మిక కుటుంబాలకు రూ.20 లక్షలు ఆర్థిక సహాయం అందించాలన్నారు. ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తే 10 వేల మందికి ఉపాధి దొరుకుతుందన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



పచ్చలనడ్కుడలో భూమిపూజ చేస్తున్న నేతలు



చౌట్‌పల్లిలో భూమిపూజ చేస్తున్న ఎంపీపీ గౌతమి

వేల్పూర్: పచ్చలనడ్కుడలో పలు అభివృద్ధి పనులకు మండల బీఆర్ఎస్ నాయకులు బుధవారం భూమిపూజ నిర్వహించారు. చేపూర్‌వాడకు రూ.5 లక్షలతో నిర్మించే గంగపుత్ర సంఘం, రూ.15 లక్షలతో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై పాత హన్మాన్ మందిరం వద్ద నిర్మించే కల్వర్టుకు, రూ.29 లక్షలతో పచ్చలనడ్కుడ నుంచి సాహెబ్‌పేట్ వెళ్లే దారిలో కల్వర్టు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బీమజమున, జెడ్పీటీసీ అల్లకొండ భారతి, సర్పంచ్ ఏనుగు గంగారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ నల్ల రమేశ్, ఎంపీటీసీలు గుడాల గంగాధర్, గంగారెడ్డి పాల్గొన్నారు.

చెరువు అలుగుల పునరుద్ధరణ పనులకు..

కమ్మర్‌పల్లి: మండలంలో చెరువు అలుగుల పునరుద్ధరణ పనులకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నిధులు మంజూరు చేసినట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రేగుంట దేవేందర్ తెలిపారు. చౌట్‌పల్లిలోని రాథోడ్ వాగు అలుగు పునరుద్ధరణ పనులకు రూ. 19.80 లక్షలు, హాసాకొత్తూర్‌లోని కొత్త చెరువు పనులకు రూ. 6.50 లక్షలు, కోనాసముందర్‌లోని పెద్ద చెరువుకు రూ. 8.25 లక్షలు, కోనాపూర్ రాళ్లవాగు మత్తడి పనులకు రూ. 23.10 లక్షలు మంజూరైనట్లు వెల్లడించారు. ఈ పనులను ఎంపీపీ గౌతమి, జెడ్పీటీసీ రాధ బుధవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. సొసైటీ చైర్మన్‌లు కుంట ప్రతాప్‌రెడ్డి, సామ బాపురెడ్డి, వైస్ ఎంపీపీ శేఖర్, సర్పంచ్‌లు దేవయ్య, శంకర్, పద్మ, రూప, ఉప సర్పంచ్‌లు లింబాద్రి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విజయ్ కుమార్

కమ్మర్‌పల్లి: జిల్లా కేంద్రంలో ఈ నెల 16న బహుజన విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే బహుజన మహనీయుల జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని కమ్మర్‌పల్లి మండల అంబేడ్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు సుంకరి విజయ్ కుమార్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఈమేరకు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి హాజరవుతారని పేర్కొన్నారు.

చలివేంద్రం, అంబలి కేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న పోచారం సురేందర్ రెడ్డి

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో పోల రాఘవేంద్ర దీప్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రం, చలివేంద్రాన్ని బుధవారం బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పోల విఠల్ సేట్, ఏఎంసీ చైర్మెన్ అబ్దుల్ హమీద్, వైస్ చైర్మన్ రాంరెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు సిరాజుద్దీన్, రైతు బంధు మండల కన్వీనర్ కిషోర్, హంగర్గా ఫారం సర్పంచ్ ఏజాజ్ ఖాన్, తదితరులు ఉన్నారు.

హామీల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న బీజేపీ నేత సుధాకర్ గౌడ్

రుద్రూర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు సుధాకర్ గౌడ్ విమర్శించారు. రుద్రూర్ మండల కేంద్రంలో బుధవారం గాంధీ చౌక్‌లో మాట్లాడారు. రుణమాఫీ ఎక్కడ చేస్తున్నారని ప్రశ్నించారు. సగానికి పైగా ధాన్యం రైతులు నష్టానికి అమ్ముకున్న తరువాత కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ, ఇంకా కొన్ని కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభించలేదని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకులపై నిందలు వేయడం సరికాదన్నారు. వారి ప్రశ్నలకు అధికార పక్షంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి ఎముల గజేందర్, మాజీ సర్పంచ్ తోట శంకర్ పాల్గొన్నారు.

సమాచారం..

16న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

రుద్రూర్: మోడల్ స్కూల్‌లో చేరడానికి దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 16న ప్రవేశ పరీక్ష ఉంటుందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆలూరి నరేందర్ తెలిపారు. ప్రవేశ పరీక్ష రాయడానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు రెండు రోజుల ముందుగానే హాల్ టికెట్ తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని, కోవిడ్ నిబంధనలు పాటించాలన్నారు. 6వ తరగతి ప్రవేశ పరీక్ష రాసే వారికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, 7 నుంచి 10వతరగతిలో ప్రవేశ పరీక్ష రాసే వారికి మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్ష ఉంటుందని వివరించారు.

బీఆర్ఎస్ నాయకుల కనుసన్నల్లో పోలీసులు



బోధన్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత మోయినొద్దీన్, ఇతర నేతలు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లో బీఆర్ఎస్ నేతల కనుసన్నల్లో పోలీసులు పని చేస్తున్నారని, వారు ప్రతిపక్షాలపై కేసులు పెట్టమని ఆదేశిస్తే కేసులు నమోదు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మోయినొద్దీన్ ఆరోపించారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో పాషా మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తలారి నవీన్‌కుమార్, నాయకులు ఇనాయత్ అలీ, ప్రసాద్‌లపై సెక్షన్–353, 506 ప్రకారం ఏసీపీ, కిరణ్‌కుమార్, సీఐ ప్రేమ్‌కుమార్‌లు కేసులు నమోదు చేశారని, ఫ్రెండ్లీ పోలిసింగ్ అంటూనే ప్రతిపక్ష నేతలపై కేసులు నమోదు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ప్రజల రక్షణ కోసం పనిచేస్తున్నారా, లేక బీఆర్ఎస్ కోసం పనిచేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు.

ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలి



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు

ఆర్మూర్‌టౌన్: ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు వెళ్లాలని ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత, ఎంవీఐ వెంకటస్వామిలు అన్నారు. బుధవారం ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద ఎంవీఐ శాఖ, ఆర్మూర్ ఆర్టీసీ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. లైసెన్స్‌లు లేని, ఆర్‌సీ బుక్ సరిగా లేని ఆటోలకు, క్యాబ్‌లకు, అధిక వేగంగా, పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున ఆటోలకు జరిమానా విధించారు. ఎస్‌టీఐ ప్రసాద్, సత్యనారాయణ, ఎస్‌డీఐ హైమద్, బాలయ్య, ప్రభాకర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముబారక్‌నగర్‌లో వేసవి ఎన్ఎస్ఎస్ శిబిరం



మాక్లూర్(ఆర్మూర్): ముబారక్‌నగర్‌లో బుధవారం వాగ్దేవి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–1, 2 వేసవి కాల ప్రత్యేక శిబిరం నిర్వహించారు. గ్రామ ప్రజలకు పచ్చదనం, పరిశుభ్రత ప్రభుత్వ పథకాలు, స్త్రీ శిశు సంరక్షణ, బేటీ బచావో, బేటీ పడావో, ఓటు విలువ, సామాజిక ఆర్థిక, నిరుద్యోగ సర్వేను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారిగా రవీంద్ర రావు, వెంకట్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రాణి రత్నాకర్, కళాశాల సెక్రటరీ సుజన్ కుమార్ రెడ్డి, అధ్యాపకులు దత్తు, వేణుగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'జిల్లా' దీక్షలు



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 115వ రోజుకు చేరాయి. దీక్షలో న్యాయవాదులు ఎం.గంగాశంకర్, శంకర్, విఠల్‌రావ్ కూర్చున్నారు.

జ్యోతీబా పూలే జయంతి

బోధన్: పట్టణ కేంద్రంలోని గాడ్స్ కాలనీలో మంగళవారం రాత్రి ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సంఘం, ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతీబా పూలే జయంతిని నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బోధన్ ఎంఈవో నాగ్‌నాథ్ పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య స్వల్ప ఘర్షణ



మాక్లూర్: మాదాపూర్‌లో బుధవారం రెండు వర్గాల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. జరిగిపోయిన హన్మాన్ జయంతి సందర్భంగా ఒక వర్గం ప్రజలు, అంబేడ్కర్ విగ్రహానికి అతి సమీపం నుంచి మామిడి తోరణాలు కట్టి ఉత్సవం నిర్వహించారు. ఈ నెల 14న అంబేడ్కర్ జయంతి ఉండటంతో మరో వర్గం ప్రజలు అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రం చేసి వారి తోరణాలు కట్టేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో హనుమాన్ జయంతి సందర్భంగా కట్టిన మామిడి తోరణాలను తొలగించే క్రమంలో రెండు వర్గాల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. వెంటనే సర్పంచ్ కొట్టాల లక్ష్మి లింగారావు, గ్రామ పెద్దలు జోక్యం చేసుకొని ఇరువురిని శాంతింపజేసి సమస్యను పరిష్కరించారు.

పల్లె పల్లెకు ఓబీసీ - ఇంటింటికీ బీజేపీ



మారంపల్లిలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న నేతలు



ఆలూర్‌లో బీసీలకు బీజేపీ చేసిన మేలు గురించి వివరిస్తున్న నాయకురాలు విజయ భారతి

నందిపేట్ (ఆర్మూర్): దత్తాపూర్, మారంపల్లి, గంగాసరం, నూత్‌పల్లి, నికాల్పూర్ గ్రామాలలో బుధవారం పల్లె పల్లెకు ఓబీసీ– ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు చేసిన అన్యాయం కేంద్ర ప్రభుత్వం ఓబీసీలకు ప్రవేశపెట్టిన పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట మండలం ఓబీసీ మోర్చా అధ్యక్షులు అల్లం భూమేష్, కోఆర్డినేటర్ నాగతారక్ పాల్గొన్నారు

ఆలూర్‌లో..

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో పల్లె పల్లెకు ఓబీసీ ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ నియోజకవర్గ బీజేపీ నాయకురాలు విజయభారతి ఇంటింటికి తిరుగుతూ ప్రధాని నరేంద్ర మోదీ బీసీల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. నాయకులు మల్లయ్య, హరీష్, గిరీష్, శుభాష్, మనీష్, భాస్కర్, శ్రీను, లింగన్న పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం



బుస్సాపూర్‌లో ప్రారంభిస్తున్న సర్పంచ్ సుజాత

బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని బుధవారం సర్పంచ్ గోపడి సుజాత ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ గంగారెడ్డి, వైద్యాధికారిణి ప్రణవ, తదితరులు పాల్గొన్నారు.

షాపూర్‌లో..

నందిపేట్(ఆర్మూర్): షాపూర్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ సౌజన్య మురళి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ వాకిడి సంతోష్ రెడ్డి హాజరై మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగవర్ధన్, ఉప సర్పంచ్ ఆమందు మహేష్, మెడికల్ ఆఫీసర్ మమత, డాక్టర్ సాయినాథ్, సుధాకర్, నరేందర్ గ్రామస్తులు పాల్గొన్నారు

ప్రతి గింజనూ ప్రభుత్వమే కొంటుంది



కోటగిరిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు



మోస్రాలో.. జెడ్పీటీసీ విజయ భాస్కర్ రెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: జిల్లాలో పలు చోట్ల కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో తెలంగాణలో తప్ప ఎక్కడా కొనుగోలు చేయడం లేదని తెలిపారు. మద్దతు ధర ఇచ్చి ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వ్యాఖ్యానించారు. తొందరపడి రైతులు దళారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు.



తల్వేదలో .. సొసైటీ చైర్మన్ బొంకం గంగారెడ్డి, ఎంపీపీ సంతోష్ రెడ్డి



రెంజల్‌లో..ఎంపీపీ రజని, జెడ్పీటీసీ విజయ



రాణాకలాన్‌లో..

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)

Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

యం. మధుసూదన్ (ACO) : 9951027699
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంబాబ్ : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776 & బాల్కొండ ప్రశాంత్ : 8919850800
బోధన్ వి. మల్లికార్జున (ACM) : 70955 23222
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899